క్లుప్తంగా

అవినీతి పాలనను ప్రతిఘటించాలి

కాజులూరు: కూటమి ప్రభుత్వ అవినీతి పాలనను ప్రజలు ప్రతిఘటించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. శనివారం బందనపూడిలో జరిగిన వైఎస్సార్ సీపీ నేత, స్థానిక ఎంపీటీసీ సలాది లక్ష్మణరావు కుమారుడు గౌతమ్‌వెంకటభాస్కర్ వివాహ వేడుకల్లో పిల్లి సూర్యప్రకాశ్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, ఎంపీపీ మాత భారతి, రామచంద్రాపురం మున్సిపల్ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హితంగా దీపావళి

కపిలేశ్వరపురం: పర్యావరణ హితాన్ని కోరుతూ దీపావళి పండుగ జరుపుకోవాలని జన విజ్ఞానవేదిక మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి శ్రీనివాస్ కోరారు. సంస్కృతి సంప్రదాయాల్లో భాగంగా ప్రజలు జరుపుకునే పండుగలు సహజ వనరులు, ప్రకృతి పరి రక్షణలో భాగంగా ఉండాలన్నారు. ప్రపంచ భూభాగం వేడెక్కుతుండడమూ, భూగర్భ జలాలు అడుగంటి పోవడమూ, తాగునీరు కలుషితమైపోవడం తదితర సమస్యలపై ప్రజలకు అవగాహనతో మెలగాలని శ్రీనివాస్ కోరారు.

కోరుమిల్లిలో కలశ పూజ



కోరుమిల్లిలో కలశాలతో ఊరేగుతున్న అయ్యప్ప మాలధారులు

కపిలేశ్వరపురం: మండలంలోని కోరుమిల్లి గ్రామంలో శనివారం అయ్యప్పస్వామి మాలధారులు కలశ పూజ చేశారు. వారంతా గ్రామంలో ఊరేగుతూ అయ్యప్ప భక్తి గీతాలు ఆలపించారు. కేరళ వాయిద్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పుణ్య గౌతమి గోదావరి జలాలతో స్వామికి అభిషేకం చేశారు.

ద్రాక్షారామలో హిందూ ఆధ్యాత్మిక చైతన్య మహాసభ



తిరుపతి జాతీయ హిందూ ధార్మిక సదస్సులో తాళ్ల సాంబశివరావు గురూజీ

రామచంద్రపురం రూరల్: ప్రముఖ శైవక్షేత్రం ద్రాక్షారామలో త్వరలో హిందూ ఆధ్యాత్మిక చైతన్య మహాసభ నిర్వహించనున్నట్లు రాజరాజేశ్వరి పీఠాధిపతి, మాసశివరాత్రి కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు శివశ్రీ తాళ్ల సాంబశివరావు గురూజీ శనివారం విలేకరులకు తెలిపారు. ఆయన తిరుపతిలో జరిగిన జాతీయ హిందూ ధార్మిక సదస్సు–2024లో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన సుమారు వెయ్యి మంది స్వామీజీలతో పాటుగా పాల్గొన్నారు. పలువురు స్వామీజీలను ద్రాక్షారామకు ఆహ్వానించగా వారు అంగీకరించారని తెలిపారు.

గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు

కపిలేశ్వరపురం: రెండు రోజులుగా మండలంలోని వివిధ గ్రామాల్లో బీజేపీ నేతలు తమ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేస్తున్నారు. పార్టీ అధినేతల ఆదేశాలపై నియోజకవర్గ కన్వీనర్ కోటిపల్లి వీవీ సాయిరామ్, జిల్లా నాయకుడు కోన సత్యనారాయణ, రాష్ట్ర కిసాన్ సెల్ కార్యవర్గ సభ్యుడు వల్లభనేని రవీంద్రబాబు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి సభ్యత్వాలు చేర్పిస్తున్నారు. మండల నాయకులు తోరం రాము, కంకటాల నాగబాబు తదితర నాయకులు పార్టీ లక్ష్యాలను ప్రజలకు వివరిస్తున్నారు. వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమ పాలనను సాగిస్తూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షిస్తోందన్నారు.

వీఆర్వో ఈశ్వరరావుకు వీడ్కోలు



గొల్లపాలెంలో వీఆర్వో ఈశ్వరరావును సన్మానిస్తున్న గ్రామస్తులు

కాజులూరు: గొల్లపాలెం రెవెన్యూ పరిధి నుంచి బదిలీ వెళుతున్న వీఆర్వో ఈశ్వరరావుకి స్థానికులు ఘనంగా వీడ్కోలు పలికారు. మండలంలోని అంద్రంగికి చెందిన ఈశ్వరరావు గొల్లపాలెం వీఆర్వో–1గా సుదీర్ఘకాలం పనిచేసి సాధారణ బదిలీల్లో భాగంగా జగన్నాథగిరి బదిలీ అయ్యారు. శనివారం గ్రామ సచివాలయంలో సర్పంచ్ పోతురాజు ప్రసన్నమానిక ఆధ్వర్యంలో స్థానికులు ఈశ్వరరావుని శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణలో ఈశ్వరరావు చేసిన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో మండల గౌడ సంఘం అధ్యక్షుడు అంగర కృష్ణ, గుబ్బల ఏసురాజు, తోట కృష్ణ, నున్న వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క క్లిక్‌తో ఉపాధి సమాచారం

- అందుబాటులో జన్‌మన్ రేగా యాప్
- ఆండ్రాయిడ్ ఫోన్‌లో అన్ని వివరాలు

రాయవరం: ఉపాధి హామీ పనులు ఎక్కడ చేశారు?. ఉపాధి కూలీల ఖాతాల్లో సొమ్ములు జమ అయ్యాయా? లేదా? తదితర వివరాలను తెలుసుకునేందుకు ఇప్పుడు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు కేంద్ర ప్రభుత్వం జన్‌మన్ రేగా యాప్‌ను తీసుకువచ్చింది. ఈ యాప్ ద్వారా సమగ్ర వివరాలు తక్షణమే తెలుసుకునే వీలుంది. కూలీల వరకూ ఏ సమాచారం కావాలన్నా ఇకపై ఎంపీడీవో, తపాలా శాఖ కార్యాలయాలు, ఉపాధి సిబ్బంది చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. సెల్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ అరచేతిలో సమగ్ర సమాచారం తెలుసుకునే వీలుంది. కాగా ఈ యాప్‌పై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

ఏయే వివరాలు ఉంటాయంటే

జన్‌మన్ రేగా యాప్‌ను ఆండ్రాయిడ్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో కూలీల వివరాలు, హాజరు, వేతనాలు తదితర వివరాలు క్లిక్ చేస్తే బ్లాక్ తెరుచుకుంటుంది. రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామ పంచాయతీ, ఉపాధి జాబ్‌కార్డు నంబరు నమోదు చేసి క్లిక్ చేస్తే వివరాలు కనిపిస్తాయి. కూలీ పేరుపై క్లిక్ చేస్తే పని చేసిన రోజులు, కూలి మొత్తం, ఏ బ్యాంకు ఖాతాలో నగదు జమ అయిందీ, ఎంత మొత్తం జమ అయిందీ వంటి వివరాలు కన్పిస్తాయి. ఒకవేళ వేతనదారుడికి నగదు జమ కాకుంటే కారణాలు స్పష్టంగా కన్పిస్తాయి. వీటితో పాటు ఉపాధి పనుల్లో చేపట్టే పనుల వివరాలు, సమాచారం ఉంటుంది.

అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు

ఉపాధి పనుల్లో అక్రమాలు, అవినీతి జరిగితే జన్‌మన్ రేగా యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)


నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో పని చేసినా, ఉపాధి సిబ్బంది బిల్లులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టినా ఫిర్యాదు చేయవచ్చు. ఈ వివరాలు అన్ని భాషల్లోనూ అందుబాటులో ఉంటాయి. ఉపాధి హామీ పథకంలో పారదర్శకతకు పెద్దపీట వేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ యాప్‌ను రూపొందించింది.

అవగాహన అవసరం

జన్‌మన్ రేగా యాప్‌పై గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. యాప్ అందుబాటులో ఉన్న విషయం చాలా మందికి తెలియదు. ఉపాధి హామీ సిబ్బంది క్షేత్ర స్థాయిలో పనులు చేసే చోట కూలీలకు అవగాహన కల్పిస్తే ఉపయుక్తంగా ఉంటుంది.

క్లస్టర్ పరిధిలో ఇదీ పరిస్థితి

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని రామచంద్రపురం, మండపేట, రాయవరం, కె.గంగవరం, కపిలేశ్వరపురం మండలాలు ఉన్నాయి. ఈ మండలాల పరిధిలో 94 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. వీరంతా ఉపాధి హామీ పనులను పర్యవేక్షణ చేస్తున్నారు. తొలుతగా ఫీల్డ్ అసిస్టెంట్లు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, కూలీలకు కూడా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఇదిలా ఉంటే క్లస్టర్ పరిధిలో 73,820 జాబ్‌కార్డులు ఉన్నాయి.



జన్‌మన్ రేగా యాప్

అవగాహన కల్పిస్తున్నాం



ఉపాధి హామీ కూలీలు వారి వేతనాలు, ఇతర విషయాలు తెలుసుకునేందుకు జన్‌మన్ రేగా యాప్ చక్కగా ఉపకరిస్తుంది. ఎవరైనా ప్లే స్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. తొలుతగా ఫీల్డ్ అసిస్టెంట్లకు యాప్‌పై అవగాహన కల్పిస్తున్నాం.

– ఎం.ఈశ్వరరావు, ఏపీవో, ఉపాధి హామీ పథకం, రామచంద్రపురం

పారదర్శకతకు పెద్దపీట



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జన్‌మన్ రేగా యాప్ పారదర్శకతకు పెద్దపీట వేస్తోంది. యాప్ ద్వారా ప్రతి విషయాన్ని తెలుసుకునే వీలుంది. కూలీలతో పాటుగా, ఉపాధి పనుల వివరాలను తెలుసుకునేందుకు ప్రజలకు కూడా ఉపయోగపడుతుంది.

– జి.సుధారాణి, ఏపీవో, రాయవరం

బాణసంచా తయారీ, విక్రయాల్లో బీ కేర్‌ఫుల్

- నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు
- రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ హెచ్చరిక

రాయవరం: బాణసంచా తయారీ, అమ్మకాల వేళ ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు వహించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ హెచ్చరించారు. రాయవరం, వి.సావరం గ్రామాల పరిధిలోని బాణసంచా తయారీ కేంద్రాల యజమానులు, తాత్కాలిక లైసెన్స్‌దారులతో శనివారం డీఎస్పీ రామకృష్ణ రాయవరం పోలీసు స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ప్రమాదాలు జరిగితే వెంటనే తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. బాణసంచా అమ్మకందారులు నోటిఫై చేసిన ప్రదేశాల్లో మాత్రమే అమ్మకాలు చేపట్టాలన్నారు. సంబంధిత శాఖల నుంచి అనుమతులు పొందిన తర్వాత మాత్రమే షాపులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమతులు పొందకుండా బాణసంచా నిల్వలు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రామచంద్రపురం అగ్నిమాపక అధికారి ఎస్.నాగేశ్వరరావు ప్రయోగ పూర్వకంగా వివరించారు. ప్రమాదాల జరగకుండా ముందుగానే తగిన రక్షణ చర్యలను ఎప్పటికప్పుడు తీసుకోవాలని బాణసంచా తయారీదారులకు వారు హెచ్చరికలు జారీ చేశారు. సమావేశంలో మండపేటరూరల్ సీఐ పి.దొరరాజు, ఎస్సై పి.బుజ్జిబాబు తదితరులున్నారు.



రాయవరం పోలీసు స్టేషన్‌లో లైసెన్స్‌దారులకు అవగాహన కల్పిస్తున్న రామచంద్రపురం అగ్నిమాపక అధికారి నాగేశ్వరరావు

అంధకారంగా గొల్లపుంత కాలనీ రోడ్డు

మండపేట: స్థానిక గొల్లపుంత కాలనీకి వెళ్లే రోడ్డులో పది రోజులుగా వీధిలైట్లు వెలగక పోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి పది గంటల దాటిన తర్వాత లైట్లు వెలుగుతున్నాయి. ఈ లోగా ప్రజలు చీకట్లో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. గొల్లపుంత ప్రారంభం నుంచి కాలనీ శివారు ప్రాంతం వరకూ సుమారు 3 కిలోమీటర్ల దూరం ప్రజలు ప్రయాణించాలి. సాయంత్రం అయ్యేసరికి వందలాది మంది విద్యార్థులు పాఠశాలల నుంచి సైకిళ్లపైనా, కొంతమంది నడిచి కాలనీకి వెళ్లాలి. లైట్లు వెలగక పోవడంతో వారంతా బిక్కుబిక్కుమంటూ ఇంటిబాట పట్టాల్సి వస్తోంది. ఈ రోడ్డుకు ఇరువైపులా పంట పొలాలు ఉన్నాయి. సాయంత్రం అయ్యే సరికి పొలాలు, లేఅవుట్ ప్రాంతాల్లో ఉండే కీటకాలు రోడ్డెక్కుతున్నాయి. వాటిలో తాచు పాములు, కట్ల పాములు, కప్పతేళ్లు వంటి విష పూరితాలు కూడా ఉంటున్నాయి. గొల్లపుంత కాలనీ నుంచి పట్టణంలోకి వివిధ రకాల పనుల్లోకి వెళ్లే మహిళలు, వృద్ధులు పొద్దుపోయాక ఈ రోడ్డుపై తిరిగి వచ్చేందుకు భయపడుతున్నారు. ఏ మూల నుంచి ఏ పాము కాటు వేస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ రోడ్డుపై వాహనాల రద్దీ ఎక్కువ కావడంతో ప్రమాదాలు కూడా ఎక్కువగానే జరుగుతాయి. యువకులు, కుర్రకారు ఈ రోడ్డుపై పందేలు వేసుకుని జెట్ స్పీడ్‌లో బైక్‌లు నడుపుతున్నారు. ఈ క్రమంలో వారు తరచూ ఎవరో ఒకరిని ఢీ కొడుతూనే ఉంటారు. గతంలో ఈ విధంగా రోడ్డు ప్రమాదానికి గురైన ఇద్దరు మరణించిన ఘటనలు కూడా వున్నాయి. ఈ విషయాలను సంబంధిత అధికారులు దృష్టిలో పెట్టుకుని కాలనీలో లైట్లు వెలిగించాలని, రోడ్డు మధ్యలో రేడియం బోర్డులు ఏర్పాటు చేయిస్తే బాగుంటుందని ప్రజలు విజ్ఞప్తి చేశారు.



గొల్లపుంత కాలనీ రోడ్డులో వెలగని వీధి లైట్లు

మహిళా స్వశక్తి భవనానికి ప్రారంభోత్సవం



మహిళా స్వశక్తి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ హరీష్ మాధుర్

మండపేట: పట్టణంలోని గొల్లపుంత కాలనీలో రూ.2.27 కోట్ల వ్యయంతో నిర్మించిన మహిళా స్వశక్తి భవనాన్ని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ శనివారం ప్రారంభించారు. మెప్మా నిధులు రూ.2 కోట్లు, మున్సిపల్ సాధారణ నిధులు రూ.27.70 లక్షలతో ఈ భవనాన్ని నిర్మించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎంపీ హరీష్‌మాధుర్‌తో పాటు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీ మాధుర్ మాట్లాడుతూ మండపేట నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు తోడ్పాటు కూడా అందిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదిగేందుకు అవసరమైన పథకాలను మండపేట మెప్మా విభాగానికి కేటాయించాలని మెప్మా ఎండీని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రంగారావు, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ, తేజ్ భరత్ లైవ్‌లీ హుడ్ స్పెషలిస్టు శ్రీనివాస్, ఐబీ సెషలిస్టు ఆదినారాయణ, మెప్మా పీడీ బి. ప్రియంవద, డీఈ శ్రీనివాస్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ సుజాత, ఏఈ పవన్‌కుమార్, టౌన్ ఎస్ఐ హరికోటి శాస్త్రి, టీడీపీ బీజేపీ, వైఎస్సార్ నాయకులు పాల్గొన్నారు.

గ్రామసభల ద్వారా భూ సమస్యల పరిష్కారం



అముజూరు రెవెన్యూ గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీపీ పంపన నాగమణి



వెదురుమూడి రెవెన్యూ గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ చిన్నారావు

కె.గంగవరం: గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ గ్రామ సభలను రైతులను సద్వినియోగం చేసుకోవాలని తద్వారా భూ సమస్యలు పరిష్కారమవుతాయని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండలంలోని అముజూరులో జరుగుతున్న గ్రామ సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. గతంలో జరిగిన రీసర్వేలో రైతులకు ఎటువంటి సమస్యలు వచ్చిన ఈ గ్రామ సభల్లో రాతపూర్వకంగా ఫిర్యాదు అందిస్తే రెవెన్యూ అధికారులు సంబంధిత సమస్యను పరిష్కరిస్తారన్నారు. చాలా వరకు రీసర్వేలో భూ సమస్యలను పరిష్కారమయ్యాయని ఇంకా గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలని కోరారు. ప్రతి గ్రామంలో ఈ రెవెన్యూ సదస్సులు జరుగుతాయని ఆమె పేర్కొన్నారు. సర్పంచ్ నానాపరపు కళ్యాణి, ఆర్ఐ వెంకట్రావు, ఇతర రెవెన్యూ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వెదురుమూడిలో ..

కపిలేశ్వరపురం: మండలంలోని వెదురుమూడి గ్రామంలో శనివారం భూముల రీసర్వే గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ చిన్నారావు సమక్షంలో పంచాయతీ కార్యదర్శి వై.శారద, రెవెన్యూ అనుబంధ శాఖల అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో భూ యాజమానులు తమ సమస్యలపై అర్జీలను అందజేశారు. తహసీల్దార్ చిన్నారావు మాట్లాడుతూ రెవెన్యూ, అనుబంధ శాఖల అధికారుల సమక్షంలో దరఖాస్తులను నమోదు చేసి, నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ రైతులు, భూ యజమానులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

‘ఉపాధి’తో కాలువల అభివృద్ధికి ప్రణాళిక

కపిలేశ్వరపురం: మాచర గ్రామ పరిధిలో రూ.68 లక్షల అంచనా వ్యయంతో పంట కాలువలు మెరుగుపరిచేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ లోవరాజు చెప్పారు. మాచర గ్రామంలో శనివారం సర్పంచ్ వాసంశెట్టి సునీత అధ్యక్షతన ఉపాధి గ్రామసభ నిర్వహించారు. 2025–26 సంవత్సరంలో చేపట్టాల్సిన ఉపాధి పనులపై రైతులు, గ్రామస్తుల నుంచి ప్రతిపాదనలు స్వీకరించారు. గ్రామసభ ఆమోదాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని లోవరాజు తెలిపారు. పంట కాలువల్లో పూడిక తొలగింపు, ఉద్యాన పంటల సాగుకు గ్రామంలోని పనుల పరిస్థితిని ఫీల్డ్ అసిస్టెంట్ శివకృష్ణ వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అడపా వేణుబాబ్జి, గ్రామస్తులు గుడాల జయబాబు, ఎం.శ్రీరామ్మూర్తి, జిత్తుక శ్రీను పాల్గొన్నారు.



మాచర ఉపాధి గ్రామసభలో మాట్లాడుతున్న టెక్నికల్ అసిస్టెంట్ లోవరాజు

ఆర్థిక సాయం

అంబాజీపేట: ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న కొర్లపాటివారిపాలెంకు చెందిన పరసా చిన్న నాయుడుకు స్థానికులు ఆర్థిక సాయాన్ని పంపిణీ చేశారు. గణపతి వీరరాఘవులు, మైపాల తాతాజీ, మేడిది చిన్న, కొర్లపాటి కాశీ, సూదాబత్తుల రవిలు నాయుడుకు మనోధైర్యం కల్పించి ఆర్థిక సాయం అందజేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ప్రమాదకరం జాగ్రత్త సుమా..

రామచంద్రపురం: పట్టణంలోని వీఎస్ఎం కళాశాల వద్ద ప్రధాన రహదారికి మధ్యలో ఉన్న డివైడర్ మీద విద్యార్థులు కూర్చుని సెల్‌ఫోన్ చూస్తూ బస్సుల కోసం ఎదురు చూస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. నిత్యం వందలాది వాహనాలు ప్రధాన రహదారికి ఇరువైపులా ప్రయాణిస్తుంటాయి. సీసీ రోడ్డు కావటంతో మోటారు బైక్‌లు కూడా వేగంగా నడుపుతున్నారు. మధ్యలో ఉన్న ఈ డివైడర్ మీద కూర్చున్న యువత రోడ్డు మీద వస్తున్న వాహనాలను కాకుండా తమ సెల్‌ఫోన్లను చూస్తూ కాలం గడిపేస్తున్నారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఇదే చిత్రం ఇక్కడ కనిపిస్తుంటుంది. వీఎస్ఎం కళాశాల యాజమాన్యం స్పందించి విద్యార్థులకు ఒక బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేస్తే బస్సుల కోసం ఎదురు చేసే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అంటున్నారు. ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు బస్సుల కోసం ఎదురు చూస్తుండడంతో బస్సులు కూడా ఒక్కోసారి ఆపకుండా వెళ్లిపోతున్నారు. దీంతో చాలా మంది ఇలా గంటల తరబడి బస్సుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. కళాశాల యాజమాన్యం, పోలీస్, ఆర్టీసీ అధికారులు స్పందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



రోడ్డు డివైడర్ మీద కూర్చున్న విద్యార్థులు

పోలీసు విధులపై విద్యార్థులకు అవగాహన



ద్రాక్షారామ పోలీస్ స్టేషన్‌లో వైర్‌లెస్ సెట్ పని విధానాన్ని విద్యార్థులకు వివరిస్తున్న ఎస్సై

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లో శనివారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 21 నుంచి నిర్వహిస్తున్న పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా తోటపేట సూర్య హైస్కూల్ విద్యార్థులకు పోలీస్ స్టేషన్‌లో ఎవరెవరు ఉంటారు వారి నిర్వహించే విధులపై అవగాహన కలిగించారు. అదే విధంగా పోలీసులు ఉపయోగించే వైర్‌లెస్ సెట్ పని చేసే విధానం వివరించారు.

నాణ్యంగా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలి



పామర్రులో సీసీ రోడ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న చెకింగ్ అధికారి బాలాజీ

కె.గంగవరం: నిబంధనల ప్రకారం పూర్తి స్థాయి నాణ్యతతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని క్వాలిటీ కంట్రోల్ చెకింగ్ అధికారి ఎం.బాలాజీ అన్నారు. మండలంలోని పామర్రులో సుమారు రూ.16 లక్షల ఉపాధి నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో ఉపాధి నిధులతో సీసీ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఈ నిర్మాణాలు పూర్తి స్థాయి నాణ్యతతో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎంజీఎన్ఆర్‌జీఎస్ ఈసీ సాగర్, కాంట్రాక్టర్ కనకాల శ్రీను, గ్రామ పెద్దలు మరివాడ సూరిబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సోమగుండం చెరువు వేలం ఖరారు



వేలం పాట నిర్వహిస్తున్న దేవస్థానం సిబ్బంది

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లిలో కొలువైన ఛాయా సోమేశ్వర స్వామి వారి ఆలయానికి చెందిన సోమగుండం చెరువులో చేపలను పొందే హక్కు కోసం నిర్వహించిన వేలం పాట ఖరారైంది. ఆలయ ప్రాంగణంలో శనివారం దేవదాయ ధర్మదాయ శాఖ రామచంద్రాపురం తనిఖీదారు బాలాజీ రాంప్రసాద్ సమక్షలో నిర్వహించిన వేలంలో జొన్న వీరబాబు సంవత్సర కాల పరిమితికి రూ.6 లక్షల 18 వేల 999కి హెచ్చు పాడుకున్నారు. దేవస్థాన అధికారులు మాట్లాడుతూ ఆలయ వేలం ఖరారు కావడం వల్ల అనధికారికంగా చెరువులో పాటదారుడు తప్ప మిగిలిన వారు దొంగతనంగా చేపలు పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈఓ భీమశంకరం, గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుదలపై ప్రత్యేక దృష్టి



తొట్టి రిక్షాలను ప్రారంభించిన సర్పంచ్ కళ్యాణి

కె.గంగవరం: గ్రామంలో పారిశుధ్యం మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించామని సర్పంచ్ నానాపరపు కళ్యాణి అన్నారు. మండలంలోని అముజూరులో శనివారం సుమారు రూ.70 వేలతో నూతనంగా కొనుగోలు చేసిన తొట్టి రిక్షాలను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్యం మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకున్నామని ప్రతి రోజు డ్రైనేజీల క్లీనింగ్‌తో పాటు విధి దీపాల నిర్వాహణ సక్రమంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. దీంతో పాటు గ్రామంలో ప్రతి ఒక్కరూ తాగునీరు ప్రతి రోజు సక్రమంగా అందుతుందున్నారు. ఇకపై కూడా మౌలిక సదుపాయాల కల్పనపైనే దృష్టి పెడతామని ఆమె చెప్పారు. అనంతరం రిక్షాలను పారిశుధ్య కార్మికులను అందజేశారు.

వైభవ వేంకటేశునికి విశేష పూజలు



విశేష అలంకరణలో టేకి వేంకటేశ్వరస్వామి వారు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర గ్రామంలోని వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం విశేష పూజలు చేశారు. స్వామివారి ఆలయంలో భక్తులు అభిషేకాలు చేశారు. ప్రధానార్చక బృందం స్వామి నిలువెత్తు విగ్రహాన్ని పుష్పాలతో అలంకరించారు. అంగరతో పాటు పడమర ఖండ్రిక, వెదురుమూడి, కపిలేశ్వరపురం, తాతపూడి, నిడసనమెట్ట, వడ్లమూరు తదితర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు దాతలు, ఆలయ నిర్వాహక కమిటీ అన్నదానం చేసింది.

టేకిలో...

టేకి గ్రామంలోని శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామిని భక్తులు దర్శించుకున్నారు. కోరుమిల్లి, మాచర, వాకతిప్ప, నాగులచెరువు, కాలేరు, నల్లూరు తదితర గ్రామాల భక్తులు స్వామికి అభిషేకాలు చేశారు.